# గుర్రం జాషువ రచనలు – మానవీయ దృక్పథం

డా.యమ్. ప్రభావతి

ఆధునిక తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువ గారు. సమకాలిన కవిత్వ ఒరవడియైన భావ కవిత్వ రీతి నుండి బయటకు వచ్చి సామజిక ప్రయోజనం కోసం రచనలు చెసారు. తక్కువ కులంగా భావింపభడ్డ కులంలొ జన్మించి, ఆ కారణంగా అనేక అవమనాలు ఎదుర్కొన్నారు. అయితే కవిత్వాన్ని ఆయుధంగా వాడుకుని ఆ మూఢాచారంపై తిరగబడ్డ కవి జాషువా. చిత్కారాలు ఎదురైన చోటే సత్కరాలు పొందారు.

జాషువా 1895, సెప్టెంబర్ 28 న వీరయ్య, లింగమ్మ దంపతులకు ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా,వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారు. తల్లిదండ్రులు వేరు వేరు కులాలకు చెందినవారు కావడం వలన మూఢాచారాలతో నిండిన సమాజంలో అవమానాలు, చిత్కారాలు ఎదుర్కొన్నాడు.స్కూలు లో చదువుకునే రోజుల్లోనే జాషువా కి కష్టాలు ప్రారంభం అయ్యాయి. అంటరానితనం జాషువాన్నీపీడించింది.

1910లో మేరీని పెళ్ళి చేసుకున్నాడు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేసేవాడు. ఆ ఉద్యోగం పోవడంతో రాజమండ్రి వెళ్ళి 1915-16 లలో అక్కడ సినిమా వాచకుడిగా పనిచేసాడు. టాకీ సినిమాలు లేని ఆ రోజుల్లో తెరపై జరుగుతున్న కథకు అనుగుణంగా నేపథ్యంలో కథను, సంభాషణలను చదువుతూ పోవడమే ఈ పని. తరువాత గుంటూరులోని లూథరన్ చర్చి నడుపుతున్న ఉపాధ్యాయ శిక్షణాలయంలో ఉపాధ్యాయుడిగా 10 సంవత్సరాల పాటు పనిచేసాడు. తరువాత 1928 నుండి 1942 వరకు గుంటూరు లోనే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేసాడు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పనిచేసాడు. 1957-59 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా పనిచేసాడు. జాషువాకు 1964లో ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలిలో సభ్యత్వం లభించింది. 1971 జూలై 24న గుంటూరులో గుర్రం జాషువా మరణించారు.

చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేది. బొమ్మలు గీయడం, పాటలు పాడడం చేసేవాడు. బాల్య స్నేహితుడూ, తరువాతి కాలంలో రచయితా అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు

కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం,రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాసాడు. వాటిలో ప్రముఖమైనవి:

గబ్బిలం, ఫిరదౌసి, బాపూజీ , క్రీస్తు చరిత్ర, ఆంధ్ర భోజుడు,కొత్తలోకం, స్వయంవరం మొధలయినవి.

సామాజిక వివక్షకు గురియై అందులో నుంచి తన జీవితాన్ని శాశ్వత సత్యాలను, మానవత్వాన్ని చెప్పె దిశగా నడిపించిన ఒక సాహిత్యపు విలువలతొ కూడిన ఒక అద్భుతమయిన రచనలు చేసిన వారు జాషువా. తొలి తెలుగు దళిత కవిత్వం అంటెనే గుర్తుకు వచ్చెది గబ్బిలం.ఇది ఒక పద్య కావ్యం. తొలి దళిత కవి జాషువా. గబ్బిలం రచనా కాలం1941 అప్పటికి భారత దేశంలలో స్వాతంత్ర్యం రాలేదు. భారత రాజ్యంగము రాలేదు. కుల వివక్ష అనే ఒక రాచపుండు భారత దేశంలో తెలుగునేలతో సహా అత్యంత దారుణమైన పరిస్థితులు వున్నరోజుల్లో ఒక అరుంధతి సుతుడు యొక్క వెదన ఏలా వుంటుందో తెలియజెస్తున్న కావ్యం గబ్బిలం.

ఒకసారి జాషువా తోటి కవులతో పాటు ప్రయాణిస్తున్నప్పుడు ఒక్కొక్కరు ఒక కవితను చెప్పమన్నారు.అప్పుడు జాషువా కూడా ఒక కవిత చెప్పగా కవులందరూ భళ భళ అని మెచ్చుకున్నారంట. అందులో ఒకరు మీది ఏ కులము అని ప్రశ్నించగా అప్పుడు నాకు చాల బాధవేసింది అంటూ,

"నా కవితా వధూటి వదనంబు ఎగాదిగా జుసి

భళీ భళీ యన్నవారు

మీదే కులమన్న ప్రశ్న వెలయించి ఛివాలున లేచిపోతే

బాకునగుమ్మినట్లేగును

పార్థివ చంద్ర వచింప సిగ్గగున్!" అని బాధపడ్డారు.

గబ్బిలం:- (1941) జాషువా రచనల్లో ఈ కావ్యం సర్వోత్తమమైనది. కాళిదాసు మేఘసందేశం తరహాలో సాగుతుంది. అయితే ఇందులో సందేశాన్ని పంపేది యక్షుడు కాదు. ఒక అంటరాని కులానికి చెందిన కథానాయకుడు తన గోడును కాశి విశ్వనాథునికి చేర వేయమని గబ్బిలంతో సందేశం పంపడమే దీని కథాంశం. ఎందుకంటె అప్పటి కాలంలో గుడిలోకి అరుంధతి సుతులకు ప్రవేశం లేదు.కాని గబ్బిలానికి అడ్డులేదు కదా! ఈ కావ్యం లో కవి కథానాయకుడి వేదనను వర్ణించిన తీరు మానవుల హృదయాలను కలచివేస్తుంది.

కవితా విశారద, విశ్వకవి సామ్రాట్ బిరుదు గల జాషువా అంటరానితనంలోని అవమానాన్ని,దారిద్ర్యంలోని బాధను తాను స్వయంగా అనుభవించారు.తన తోటి సోదరులు బంధువులు అంధకారంలో రోజువారి కూలిపై అర్ధకాలితో జీవిస్తున్న వారి గాధలను, బాధలను తను స్వయంగా చూశారు. ఆ బాధల్లో నుంచి వచ్చిన అక్షరరూపమే ఈ " గబ్బిలం".

"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుగాని దుః

ఖితమతు లైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్

మెతుకు విదల్ప దీ భరతమేదిని ముప్పదిమూడుకోట్ల దె

వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తు లాఱునే.

దేవుళ్ళకి కళ్యాణం చేయడానికి వందలు వేళ్ళు ఖర్చు చేస్తారు గానీ ఆకలితో బాధపడుతున్న పేదలకు గానీ, పకీరులకు వాళ్ళ పాత్రల్లో అన్నం మెతుకులు విదిలించరు. అలాంటి భారత దేశంలో ముక్కోటి దేవతలు వున్నా ఆకలితో ఆలమటించే వారికి మాత్రం వాళ్ల ఆకలి బాధలు తీర్చే వారే లేరు అని సమసమాజం లో జరుగుతున్న విషయాలు పాఠకులకు కళ్ళకు కట్టినట్లు వివరించడం లో జాషువ ఒక మహోన్నతమైన కవి అని చెప్పవచ్చు.

ఆలయంబున నీవు వ్రేలాడు వేళ

శివుని చెవి నీకు గొంతచేరువుగ నుండు

మౌని ఖగరాజ్ఞి! పూజారిలేని వేళ

విన్నవింపుము నాదు జీవిత చరిత్ర!

దేవుడు కరుణించినా పూజారి వరమియ్యడనేది పాత బడ్డ సామెత. "అమ్మా! గబ్బిలమా! శివుడికి పంచముల ఆక్రందనలు విన్నవించే సమయంలో పూజారి గనక విన్నాడంటే నీకు ప్రాయశ్చిత్తం తప్పదు. అంతెందుకు, పూజారికి ఆ పరమ శివుడు కూడా భయపడతాడు. నీవు విన్నవించే విషయం పూజారికి తెలిసిందని ఆ దేవదేవుడికి

తెలిస్తే 'అతడు కూడా' నీమీద కోపగిస్తాడమ్మా! కాబట్టి పూజారి విషయం జాగ్రత్తగా చూసుకో" అని హెచ్చరిస్తాడు. ఇలా ప్రతి పద్యంలో జాషువా పాఠకుల కళ్ళముందు ప్రత్యక్షమవుతాడు.

అధికాక

"వాని నైవేద్యమున నంటు వడిన నాడు

మూడు మూర్తులను గూడ గూడు లేదు".

నీవు దేవుడికి పెట్టిన నైవేద్యమును ముట్టుకున్నచొ ఆ త్రిమూర్తులకి కూడా ప్రసాదాలు ఉండవు.ఎందుకంటె నీవు నా వంటి అభాగ్యుడి ఇంటికి వచ్చి దేవాలయానికి వెళ్ళావు కదా.అని తన ఆవేదనను తెలియజేస్తాడు.నాలాంటి ఆభాగ్యుడికి గుడిలోకి ప్రవేశం లేదు.నన్ను ఈ సమసమాజం హీనుడిగా చూస్తుంది.

సమకాలీన సమాజంలో మనిషికీ మనిషికీ మధ్య ఆడ్డుగోడలు పెట్టి మానవతను మాటుమాయం చేసిన వర్ణవ్యవస్థ " వేయిపడగ"లై వీజృంభిస్తున్న కాలం ఇది.

గసరి బుసకొట్టు నాతని గాలిసోక

నాల్గు పడగల హైందవ నాగరాజు.

అని ఎవరి మనసులను నొప్పించకుండా సుతిమెత్తగా హృదయానికి హతుకొనేటట్లు చెప్పటం జాషువా వారి గొప్పతనం.

అరుంధతి పుత్రుడికి ఈ భారతావని "అప్పుపడ్డది".

వాడు చెమటోడ్చి ప్రపంచమునకు

భోజనము పెట్టు, వానికి భుక్తిలేదు.

అహర్నిశలు కష్టపడి పండించే ధాన్యాన్ని ఆలయాలలో దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు, కానీ ఆ ధాన్యం పండించే వారికి మాత్రం ఆలయ ప్రవేశం లేదు.మానవతా విలువల్ని మట్టిలో కలిపేస్తున్న, మనిషికీ మనిషికీ మధ్య అగాధాన్ని సృష్టిస్తున్న వర్ణవ్యవస్థ మీద ద్వజమెత్తి అందరూ సమానమే అనె సిద్ధాంతాన్ని తెలియజేశారు జాషువా.

నవయుగకవి చక్రవర్తి జాషువా గారు ఎన్నో పురస్కారాలు,బిరుదులు పొందారు.1964 లో క్రీస్తుచరిత్ర కు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు,1970 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది.1970 లొనే పద్మభూషణ్ అవార్డు పొందారు.

మధుర శ్రీనాథ, కవికోకిల బిరుదు కల జాషువా కాలికి తిరుపతి వెంకటకవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి స్వయంగా గండపెండేరం తొడిగి,ఈ కవీశ్వరుని పాదం తాకి నా జన్మ ధన్యం అయింది అన్నారు. నాకు జీవితం ఎన్నో పాఠాలు నేర్పింది.నాకు ఇద్దరు గురువులు - ఒకటి నాకు సహనాన్ని నేర్పింది,రెండవది నాలో ఎదిరించే శక్తిని,ధైర్యాన్ని ఇచ్చింది. దారిద్ర్యయాన్ని జయించి కులమత భేదాలకు అతీతంగా మానవత్వం గల మనిషిగా నిరూపించుకోదలిచాను.

మహోన్నత మానవతామూర్తి దళిత చైతన్య కవితాదీప్తి గుర్రంజాషువా. వడగాల్పులు నా జీవితం అయితే వెన్నెల నా కవిత్వం అని చెబుతుంటారు. జాషువా కవితా భావాలు సిగ్గుపడుతూ నడిచి వచ్చే జవరాళ్లులా ఉంటాయి అని తోటి కవులు పొగుడుతూ ఉంటారు.జాషువా సామాన్యుడి నుండి ధనవంతుల వరకు,సమాజంలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజల నోళ్ళలో అక్షరంగా నేటికి జీవించి ఉన్నారు.

ఆధార గ్రంధాలు:


1. గుర్రం జాషువ - గబ్బిలం .
2. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ - జాషువా సాహిత్యం- దృక్పథం – పరిణామం.
3. జానమద్ది, హనుమచ్ఛాస్త్రి - "జాషువా". సుప్రసిద్ధుల జీవిత విశేషాలు.